

సాక్షి
గుంటూరు
మంగళవారం । 17 । జనవరి । 2023



సాగునీటి సమాచారం


తాడేపల్లిరూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1,216 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 900 క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.2558 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2,000 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

రేపు నర్సింగ్ అభ్యర్థులు సర్టిఫికెట్లతో రావాలి

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం పరిధిలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పరిశీలనకు హాజరు కావాలని గుంటూరు ఇన్‌చార్జి ఆర్డీ డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 272 స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు సమాచారం అందించామని, వారంతా ఈనెల 18న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న ఆర్డీ కార్యాలయానికి ఉదయం 9 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

28,766 హెక్టార్లలో రబీ పంటల సాగు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో రబీ పంటల సాధారణ విస్తీర్ణం 71,624 హెక్టార్లు ఉండగా, ఇప్పటి వరకు 28,766 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. అక్టోబర్ రెండో వారం నుంచి రబీ సీజన్ మొదలైంది. జిల్లాలో మొక్కజొన్న సాధారణ సాగు 20,514 హెక్టార్లు ఉండగా 14,693 హెక్టార్లలో, జొన్న 22,077 హెక్టార్లకు 3,789 హెక్టార్లలో, వరి 1,082 హెక్టార్లకు 236 హెక్టార్లలో, మంచిశనగ 10,098 హెక్టార్లకు 5,542 హెక్టార్లలో, కంది 112 హెక్టార్లకు 17 హెక్టార్లలో, పెసర 10,323 హెక్టార్లకు 2,354 హెక్టార్లలో, మినుము 6,518 హెక్టార్లకు 1,717 హెక్టార్లలో, పొగాకు 754 హెక్టార్లకు 418 హెక్టార్లలో సాగయ్యాయి.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అవసరమైన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సీనియర్ ఎస్జీటీలను నెలకు రూ.2,500 అలవెన్సుపై నియమించేందుకు మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది అక్టోబర్‌లో జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో విల్లింగ్ ఇచ్చిన ఎస్జీటీలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు హైస్కూళ్లలో అవసరమైన గణితం, బయాలాజికల్ సైన్స్, ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ పోస్టుల్లో నియమించేందుకు ఈనెల 13న కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఇంకా మిగిలి ఉన్న 30 శాతం డీఎస్సీ కోటా ఖాళీల భర్తీకి ఆయా సబ్జెక్టులకు సంబంధించి, సీనియార్టీ జాబితాలో ఉన్న ఎస్జీటీలు మంగళవారం ఉదయం 10.30 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. డీఈవోజీఎస్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాలో ఉన్న ఎస్జీటీలు సర్వీసు రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో రావాలని కోరారు.

శింగరకొండ క్షేత్ర అభివృద్ధికి చర్యలు

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



అద్దంకి: శింగరకొండ క్షేత్ర అభివృద్ధికి టీటీడీ తరపున తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం సంక్రాంతి పండగ సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, దేవస్థాన కమిటీ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఏసీ సుభద్ర సాదర స్వాగతం పలికారు. దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ అర్చకులు పూలమాలలతో సత్కరించి, స్వామి శేష వస్త్రాన్ని బహూకరించి, తీర్థప్రసాదాలు అందించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్షేత్రాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం సోమవారం 574.20 అడుగుల వద్ద ఉంది. ఇది 267.1112 టీఎంసీలకు సమానం.

19న జర్నలిజం-నైతిక విలువలు అంశంపై సదస్సు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): జర్నలిజం-నైతిక విలువలు అనే అంశంపై ఈ నెల 19వ తేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు నగరంలోని మేరీస్ స్టెల్లా కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో సదస్సు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్ఆర్‌టీఎస్) చైర్మన్ ఎం.వెంకట్ హాజరై యువతకు విదేశాల్లో విద్య, ఉపాధి అంశాలపై అవగాహన కల్పిస్తారని వివరించారు.



ఆనంద ఆలాపన : గుంటూరులో సినీ గీతాలు పాడుతున్న గాయకులు



జనోత్సవం : గుంటూరులో జరిగిన సంక్రాంతి సంబరాలకు హాజరైన ప్రజలు



'నృత్య'నూతనం : నరసరావుపేటలో జరిగిన వేడుకల్లో నృత్యకళాకారుల ప్రదర్శన

సంతోషాల మకరందం

- పెద్ద పండగ హుషారు
- పల్లెగూటికి సంక్రాంతి శోభ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటిన వేడుకలు
- నరసరావుపేట, గుంటూరు, బాపట్ల జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో సంబరాలు
- అలరించిన సినీ, టీవీ ప్రముఖుల సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి, నరసరావుపేట/గుంటూరు వెస్ట్/ బాపట్ల టౌన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా మకర సంక్రాంతి, కనుమ వేడుకలు అంబరాన్నంటాయి. పల్లెలు పండగ శోభతో మిలమిలా మెరిశాయి. విద్యా, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సొంతూళ్లకు చేరుకున్నారు. బంధుమిత్రులతో కలిసి ఆనందంగా సంబరాలు జరుపుకున్నారు. ఇళ్ల ముంగిళ్లలో హరివిల్లులను తలపించేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. వాటిమధ్య గొబ్బెమ్మలను అలంకరించారు. గంగిరెద్దుల విన్యాసాలు కనువిందుచేశాయి. హరిదాసుల సంకీర్తనలు వీనుల విందు చేశాయి. అమరావతి, కోటప్పకొండ తదితర ప్రసిద్ధ దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. సోమవారం కనుమ సందర్భంగా పశుసంపదకు ప్రత్యేక పూజలు చేశారు. పలు నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఎడ్లపందేలు, సంప్రదాయ కోడి పందేలు హుషారుగా సాగాయి.



సంబరాల సంక్రాంతి : నరసరావుపేటలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే గోపిరెడ్డి



సంతోష నర్తనం : కొల్లిపరలో నృత్య ప్రదర్శన

- నరసరావుపేట పట్టణంలోని స్పోర్ట్స్ స్టేడియంలో జిల్లా అధికార యంత్రాంగం, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కళాకారులతోపాటు సినీ, టీవీ రంగాల కళాకారులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత విభావరి ఆకట్టుకున్నాయి.
- గుంటూరు కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సంబరాలు అంబరాన్నంటాయి. కలెక్టర్, కుటుంబ సభ్యులతో కలిసి సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. గంగిరెద్దుల విన్యాసాలు తిలకించారు. హరిదాసుల ఆటపాటలను వీక్షించారు.
- బాపట్ల జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గంగిరెద్దుల విన్యాసాలు, భోగి మంటలు, హరిదాసుల ఆటపాటలను వీక్షించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు చోట్ల కనుమ సందర్భంగా సోమవారం పశువులకు పూజలు చేశారు. పశువుల కొమ్ములకు వైఎస్సార్ సీపీ రంగులు అద్ది రైతులు సంక్షేమ సర్కారుపై తమ అభిమానం చాటుకున్నారు.
- **ఒంగోలు అర్బన్:** ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ నివాసంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. కలెక్టర్ దినేష్ కుమార్, ఆయన సతీమణి బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు మలికాగర్గ్, వకుల్ జిందాల్ దంపతులు ఈ వేడుకలకు హాజరయ్యారు. వీరంతా సంప్రదాయ దుస్తుల్లో పిల్లలతో కలిసి సందడి చేశారు. పొంగళ్లు పెట్టారు. గంగిరెద్దుల విన్యాసాలను తిలకించి ఆనందంగా గడిపారు.



అట్ట'హాసం' : ఒంగోలులో బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్ దంపతులు, ఎస్పీ వకుల్ జిందాల్ దంపతుల నవ్వులు



కను'బొమ్మ'ల్లో 'కొలువు' : బాపట్లలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



వేడుకల్లో గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబం

ఆరుతేరిన నగర పాలన

- అన్నింటా గుంటూరు ముందంజ
- సిటిజెన్ పెర్సెప్షన్ సర్వేలో రాష్ట్రంలో ఫస్ట్..
- దేశంలో ఆరో స్థానం కైవసం
- కేంద్రం నుంచి మరిన్ని నిధులు వచ్చే అవకాశం
- పన్ను వసూళ్లలోనూ ముందు
- గడప గడప పనుల్లోనూ ప్రథమం
- శరవేగంగా గుంటూరు కార్పొరేషన్ అభివృద్ధి



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థ అన్ని రంగాలలో దూసుకుపోతోంది. ఇటీవల జాతీయ స్థాయిలో గుంటూరుకు ప్రత్యేక స్థానం దక్కింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సిటిజన్ సర్వేలో గుంటూరు నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో ఆరో స్థానంలో నిలవగా, రాష్ట్రంలోని గ్రేటర్ విశాఖపట్నం, విజయవాడ నగరపాలక సంస్థలనూ పక్కనపెట్టి మొదటి స్థానంలో గుంటూరు నిలిచింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ సర్వేలో దేశవ్యాప్తంగా 263 పట్టణాలు పాల్గొన్నాయి. ఈ సర్వేలో మొదటి స్థానంలో మహారాష్ట్రలోని థానే మెట్రోపాలిటిన్ సిటీ, రెండో స్థానంలో బెంగళూరు, మూడో స్థానంలో భోపాల్, నాలుగో స్థానంలో మహారాష్ట్రలోని పింపిరి చిన్‌చ్‌వాడ్, ఐదో స్థానంలో మహారాష్ట్రలోని మైరా భైన్‌దార్, ఆరో స్థానంలో గుంటూరు నగరపాలక సంస్థ నిలిచాయి.

సర్వే ఎందుకంటే..!

మనం ఏదైనా పనిమీద వేరే రాష్ట్రం వెళ్తే అక్కడ మంచి బస ఉందా లేదా అని చూస్తాం. ఆయా హోటళ్లకు ఉన్న రేటింగ్స్‌ను బట్టి ఎక్కడ దిగాలో నిర్ణయించుకుంటాం. అలానే జాతీయ స్థాయిలో పలు మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం రేటింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఈ సర్వేను కేంద్రం నిర్వహించింది.

సర్వేతో ఉపయోగమేంటంటే..

కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో మంచి గుర్తింపు పొందడం వల్ల గుంటూరు నగరపాలక సంస్థకు కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ఇతర పథకాల్లో గుంటూరుకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. అన్ని రంగాల్లో కూడా సముచిత స్థానం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే అభివృద్ధి పరుగులు

గుంటూరు నగరపాలక సంస్థలో ఇప్పటికే అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాన రోడ్ల విస్తరణ పనులు రూ.కోట్లతో జరుగుతున్నాయి. ఇటీవలే అరండల్‌పేట ఓవర్‌బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ.130 కోట్లతో ముఖ్యమంత్రి ఆమోద ముద్ర వేశారు. రూ.139 కోట్లతో పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణానికి పరిపాలనా అనుమతులు వచ్చాయి. అలాగే ఆధునిక కబేళాకు అనుమతులు రాగా, తాజాగా పర్యావరణ అనుమతులూ వచ్చాయి. ఆస్తిపన్నుల వసూలులోనూ గుంటూరు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. 2022-23 రెండో అర్ధ సంవత్సరపు వసూళ్లలో డిసెంబర్ 30, 31 రెండు రోజుల్లోనే రూ.7.50 కోట్లు వసూలు చేసి రాష్ట్రంలో మొదటిస్థానం దక్కించుకుంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నాయి. ఈ పనులకు సంబంధించి టెండర్లు, ఆమోదం పొందిన వర్కులు కూడా ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల కంటే గుంటూరులోనే ఎక్కువ కావడం గమనార్హం.

సర్వేలో 3,35,531 మంది భాగస్వామ్యం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఈ సర్వేలో 3,35,531 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సర్వేలో 8 కేటగిరిలకు వంద మార్కులు కేటాయిస్తే గుంటూరు నూరు మార్కులూ సాధించింది. సర్వేలో అడిగిన అంశాలు వరుసగా మీ ఊరిలో ఎడ్యుకేషన్ ఎలా ఉంది? హాస్పిటల్, స్పెషలిస్ట్ డాక్టర్లు ఉన్నారా.. లేరా?, మహిళల భద్రత ఎలా ఉంది? ఉపాధి, పొల్యూషన్ కంట్రోల్ ఎలా ఉంది? వాటర్ సౌకర్యాలు బాగున్నాయా?, డ్రెయినేజీ, రోడ్ల వ్యవస్థ బాగుందా? పవర్ కట్ ఎలా ఉంటుంది? వంటి ఇతర పలు అంశాల్లో సర్వే జరిగింది. గుంటూరు జనాభాలో 52 శాతం మంది ఈ సర్వేలో పార్టిసిపేట్ చేయడం ద్వారా గుంటూరు జాతీయ స్థాయిలో ఆరో స్థానంలో నిలిచింది. అదే విధంగా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రత్యేక గుర్తింపు పొందింది.

మరింత కృషి



గుంటూరు నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తాం. మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధిలో కూడా ముందు ఉండేలా చూస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనులు చేస్తూ గుంటూరును రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థానంలో ఉండేలా చూస్తాం.

– కావటి మనోహర్ నాయుడు, మేయర్, గుంటూరు

సిబ్బంది సహకారంతోనే..



కేంద్రం నిర్వహించిన సిటిజన్ పర్సెప్షన్ సర్వేలో గుంటూరు జాతీయ స్థాయిలో 6వ స్థానంలో, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం గర్వకారణం. సచివాలయ సెక్రటరీలు, ఉద్యోగుల కృషితోనే ఇదంతా సాధ్యమైంది. ఈ సర్వేలో గుంటూరుకు మంచి ర్యాంకు రావడం ద్వారా కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

– కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్

కన్న కొడుకును కడతేర్చిన తండ్రి

తలపై రాయితో మోది దారుణంగా హత్య

చీమకుర్తి: చేతికందొచ్చిన కొడుకును కన్నతండ్రే కిరాతకంగా హత్య చేశాడు. మండలంలోని బూసురపల్లి గ్రామంలో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ బాబు, తన భార్య మార్తమ్మ, కుమారుడు సునీల్ (26)తో కలిసి బూసురపల్లి గ్రామంలోని నల్లపాటి వెంకట్రావు అనే రైతు వద్ద పొగాకు పచ్చాకు పనులు చేసేందుకు నెల రోజుల క్రితం వచ్చాడు. ఈనెల 14న జొన్నలగడ్డ బాబు పచ్చాకు పనుల కోసం వచ్చిన తోటి వారిని అసభ్యంగా తిడుతూ శాడిస్టుగా ప్రవర్తిస్తున్నాడు. అది చూసి కొడుకు సునీల్ అలా ఎందుకు చేస్తున్నావని ప్రశ్నించాడు. మద్యం తాగిన బాబు.. పచ్చాకు పనులు అయిపోయేలోపు నిన్ను చంపేస్తానంటూ కొడుకుపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. గతంలో స్వగ్రామంలో భార్య, కుమారుడిపై బాబు కత్తి, గొడ్డలితో దాడి చేశాడు. ఆ సమయంలో వారికి తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లో గ్రామంలోని పెద్దల సమక్షంలో పోలీసు స్టేషన్ వద్దకు పోకుండా బాబు బయటపడ్డాడు. ఆ ఘటనలను దృష్టిలో ఉంచుకొని రెండు రోజుల క్రితం చంపుతానని బాబు ఇచ్చిన హెచ్చరికలతో తల్లి, కొడుకు భయపడి బాబుకు కనపడకుండా పచ్చాకు పనులు చేసుకుంటూ ఉన్నారు. సోమవారం ఉదయం నల్లపాటి వెంకట్రావు పశువుల కొట్టంలో సునీల్ నిద్రపోతుండగా తండ్రి బాబు సమీపంలోనే ఉన్న గ్రానైట్ రాయిని తీసుకొని అతని తలపై బలంగా కొట్టి హత్య చేసినట్లు ఘటన స్థలంలో ఉన్న రక్తపు మరకలు అంటిన రాయిని బట్టి పోలీసులు నిర్ధారించుకున్నారు. కొడుకు కనపడలేదని తల్లి మార్తమ్మ వెతుకుతూ కొట్టం వద్దకు వచ్చినప్పుడు రక్తపు మడుగులో ఉన్న కొడుకు సునీల్ మృతదేహాన్ని చూసి బంధువుల ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చింది. విషయం తెలుసుకున్న డీఎస్పీ నాగరాజు, సీఐ రాంబాబు, ఎస్సై ఆంజనేయులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. తల్లి మార్తమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. బాబు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



సునీల్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

భర్తను హతమార్చిన భార్య

● ప్రియుడితో కలిసి ఘాతుకం ● పోలీసుల అదుపులో నిందితులు

తాడేపల్లిరూరల్(మంగళగిరి): పండగ వేళ కట్టుకున్న భార్య ప్రియుడితో కలిసి భర్తను కర్కశంగా హతమార్చింది. విచక్షణారహితంగా కొట్టి చంపింది. మంగళగిరి సీఐ అంకమరావు కథనం ప్రకారం మంగళగిరి పట్టణానికి చెందిన వింజమూరు క్రాంతికుమార్ (32) బంగారం పని చేస్తుంటాడు. ఏడేళ్ల క్రితం ఏలూరుకు చెందిన గంగాలక్ష్మితో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. క్రాంతికుమార్ శనివారం అర్ధరాత్రి వరకు షాపులో ఉండి అనంతరం ఇంటికి వచ్చాడు. సమీప బంధువు అయిన ఏలూరుకు చెందిన మరిడయ్య అనే యువకుడితో కలిసి గంగాలక్ష్మి బెడ్‌రూంలో సన్నిహితంగా ఉండడం చూసి నిర్ఘాంతపోయాడు. భార్యతో గొడవ పడ్డాడు. మరిడయ్యను నిలదీశాడు. దీంతో వారిద్దరూ ఘర్షణకు దిగారు. ఈ సమయంలో క్రాంతికుమార్‌ను గంగాలక్ష్మితోపాటు మరిడయ్య బయటకు తీసుకొచ్చి మరో వ్యక్తితో కలిసి విచక్షణారహితంగా రాడ్లతో కొట్టారు. దీంతో క్రాంతికుమార్ బిగ్గరగా కేకలు వేస్తూ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కేకలు విని చుట్టుపక్కల వారు ఘటనా స్థలానికి వచ్చేసరికి క్రాంతికుమార్ మృతి చెందాడు. గంగాలక్ష్మి, మరిడయ్యతో కలిసి అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించింది. ఇదే సమయంలో ఘటనా స్థలానికి వచ్చిన మంగళగిరి సీఐ అంకమరావు గంగాలక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మరిడయ్య, మరో వ్యక్తి పరారయ్యారు. క్రాంతికుమార్ సోదరుడు హరికృష్ణ మంగళగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెళ్లికాక ముందు నుంచే గంగాలక్ష్మి మరిడయ్య మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్టు సమాచారం. గంగాలక్ష్మి భర్తతో కలిసి ఆదివారం ఉదయం పండగకు ఏలూరు పుట్టింటికి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, మరిడయ్య ఇక్కడకు రావడం, క్రాంతికుమార్‌ను చంపడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు పథకంలో భాగంగానే హత్య జరిగినట్టు క్రాంతికుమార్ బంధువులు ఆరోపిస్తున్నారు.



మృతుడు క్రాంతికుమార్

భార్యను కడతేర్చి, భర్త బలవన్మరణం

పొన్నూరు: భార్యను కడతేర్చి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కసుకర్రు గ్రామానికి చెందిన తూపాటి చిన్న సుబ్బారావు, రోజా దంపతులు కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. వీరిద్దరూ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఆదివారం రాత్రి కూడా భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో చిన్న సుబ్బారావు రాడ్డుతో రోజాను కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. చిన్న సుబ్బారావు కూడా ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం భార్యాభర్తలు ఇంటిలో నుంచి బయటకు రాకపోవటంతో అనుమానం వచ్చిన స్థానికులు పరిశీలించగా, ఇంటిలో ఇద్దరూ మరణించి ఉన్నారు. దీంతో చిన్న సుబ్బారావు అన్న సుబ్బారావు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ భార్గవ్ తెలిపారు.



మృతులు రోజా, చినసుబ్బారావు

క్లుప్తంగా

పెదకాకాని శివాలయంలో సంక్రాంతి పూజలు

పెదకాకాని: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు అంత్రాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం గామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక రథంపై శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఏర్పాట్లను ఆలయ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

20 నుంచి టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షల దరఖాస్తు ప్రక్రియ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా మండలి ఆధ్వర్యంలో ఫిబ్రవరి, మార్చిలో జరగనున్న టైపు రైటింగ్, షార్ట్‌హ్యాండ్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినట్లు ఏపీ టెక్నికల్ ఇనిస్టిట్యూషన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీవీఎస్ ప్రకాష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పరీక్షలకు ఈనెల 20 నుంచి 27వ తేదీలోపు అపరాధ రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. ఫిబ్రవరి 25న షార్ట్ హ్యాండ్ తెలుగు, 26న ఇంగ్లిష్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మార్చి 4, 5వ తేదీల్లో టైపు రైటింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు జరగనున్నట్లు వివరించారు. ఇతర వివరాలకు గుంటూరు బ్రాడీపేట 2/14లో ఎస్‌బీఐ ట్రెజరీ బ్రాంచ్ ఎదుట ఉన్న భరణి టెక్నికల్స్‌లో నేరుగాను, 9346224443, 0863-2242947 నంబర్లలోనూ సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిని నీటిలో ముంచి హత్య చేసిన ఇద్దరు అరెస్టు

- మునిగి చనిపోయాడని చిత్రీకరణ
- పొంతన లేని సమాధానాలు చెప్పి పోలీసులకు దొరికిపోయిన నిందితులు


పోలీసుస్టేషన్‌లో వివరాలు తెలుపుతున్న సీఐ బండారు సురేష్‌బాబు. వెనుక నిందితులు

పెదకాకాని: ఓ వ్యక్తిని నీటిలో ముంచి హత్య చేసి, తర్వాత మునిగి చనిపోయాడని పొంతన లేని సమాధానాలు చెబుతూ ఇద్దరు పోలీసులకు దొరికిపోయిన సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. సీఐ బండారు సురేష్‌బాబు కథనం ప్రకారం...పెదకాకాని సంకురివారిపేటకు చెందిన బట్టు బాబీ వంట పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా బాబీ ఇంటికి సమీపంలో ఉన్న స్నేహితుడు గొట్టిపాటి మరియదాసు భార్యతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయాన్ని గుర్తించిన మరియదాసు కక్ష పెంచుకుని అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. అలానే బాబీకి వరుసకు బాబాయి, అమ్మమ్మకు మేనల్లుడు అయిన కసపర్తి రాజశేఖర్‌తో పొలం అమ్మి డబ్బులు పంచుకునే విషయంలో విభేదాలు ఉన్నాయి. అయినప్పటికీ ముగ్గురు కలసి వంట పనులకు వెళుతున్నారు. ఈ నెల 12న గ్రామంలో వంటి పనికి వెళ్లారు. పూర్తి కాగానే డబ్బులు తీసుకున్నారు. అనంతరం బాబీని హతమార్చాలని రాజశేఖర్, మరియదాసు పథకం వేశారు. ముగ్గురు మద్యం తాగిన తర్వాత పెదకాకాని నుంచి గోళ్లమూడి రోడ్డులో ఉన్న గుంటూరు చానల్(కొత్త కాలువ)కు ఈతకు వెళ్లారు. ముందుగా అనుకున్న విధంగా వారిలో మరియదాసు కాలువలో ఈత వేస్తూ కాపాడాలని కేకలు వేయడం, ఒడ్డున ఉన్న రాజశేఖర్ నీళ్లలో దూకి కాపాడాలని కేకలు వేస్తూ బాబీని కూడా నీటిలోకి తోశాడు. ఆ తర్వాత మరియదాసు వద్దకు వెళ్లిన బాబీని తలపై చేయి వేసి బలవంతంగా నీటిలో ముంచాడు. ఊపిరాడక ఇబ్బంది పడుతున్న బాబీని రెండు కాళ్లతో ఊబిలోకి తొక్కిపడుతూ హతమార్చాడు. తొలుత ప్రమాదవశాత్తూ అని భావించినప్పటికీ మృతుని భార్య రమ్య అనుమానం వ్యక్తం చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టారు. ఈ సమయంలో రాజశేఖర్, మరియదాసు పొంతన లేని సమాధానం చెబుతూ పోలీసులకు దొరికిపోయారు. మద్యం మత్తులో ఉన్న బాబీ నీటిలో ముంచి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చిన విషయం ఒప్పుకున్నారు. దీనిపై నిందితులు గొట్టిపాటి మరియదాసు, కసపర్తి రాజశేఖర్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు సోమవారం సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వి. రాంబాబు, ఏఎస్ఐలు కె. శివశంకర్‌సింగ్, కె. వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటమి గెలుపునకు తొలి మెట్టు

- మంగళగిరి బెటాలియన్ సీఐ అద్దేపల్లి గణపతి
- ముగిసిన నాలుగు జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న సీఐ గణపతి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

తెనాలి టౌన్: ఓటమి గెలుపునకు తొలి మెట్టు అని మంగళగిరి బెటాలియన్ సీఐ అద్దేపల్లి గణపతి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులోని రెసిడెన్సియల్ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో ఈనెల 10 నుంచి పొన్నెకంటి బెంజిమన్ స్మారకంగా కొత్త ఐజక్ శ్యామ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. ఏబీఎం చర్చి అధ్యక్షుడు సుద్దపల్లి శరత్ వెంకయ్య అధ్యక్షతన బహుమతి ప్రదానోత్సవ సభ నిర్వహించారు. సీఐ గణపతి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి విద్య, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఏఎన్‌యూ జియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అందుబాటులో ఉన్న సౌకర్యాలతో బ్యాడ్మింటన్ క్రీడను ప్రోత్సహిస్తున్న కిస్బా టీమ్ సభ్యుల్ని అభినందించారు. గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి మాట్లాడుతూ కరుణానిలయం విద్యాసంస్థల్లో చదివిన ఎందరో విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. తొలుతగా బెంజిమన్, ఐజాక్‌శ్యామ్ చిత్రపటాలకు పి.బి. విజయకుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికల్ని అందజేశారు. సంస్థ ఆవిర్భావం, నిర్వహిస్తున్న క్రీడల వివరాలను కిస్బా అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రబాబు, వినయ్‌కుమార్, రాంబాబు తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు దానబోయిన ప్రసాద్ యాదవ్, ప్రసాదం సురేష్, నన్నపనేని అనిల్, హనుమంతరావు, మురళీధర్, కిస్బా సభ్యులు జార్జి థామస్, కిరణ్మయి, కరీముల్లా, కటిక శ్రీకాంత్, మేకల రమేష్, సత్యనారాయణ, నాగరాజు, ధీరజ్ పాల్గొన్నారు.

విజేతలు వీరే...

మెన్స్ సింగిల్స్ : ప్రథమ స్థానం కిరణ్ (బాపట్ల), ద్వితీయ స్థానం సాయి చరణ్ (తెనాలి), తృతీయ స్థానం రాంచరణ్ (బాపట్ల)

మెన్స్ డబుల్స్ : ప్రథమ స్థానం రాంచరణ్, వెంకటేష్ (బాపట్ల), ద్వితీయ స్థానం ఆకాష్, జితేంద్ర (చిలకలూరిపేట), తృతీయ స్థానం సాయిచరణ్, కిరణ్(తెనాలి)

టీడీపీది దిగజారుడు రాజకీయం

ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

చెరుకుపల్లి: సంక్రాంతి పండుగ రోజు టీడీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆరోపించారు. మండలంలోని కనగాలలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటే టీడీపీ నాయకులు జీఓ నంబర్ 1 కాగితాలను భోగి మంటల్లో వేసి తగలపెడుతూ ఆనందం పొందుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో సకాలంలో వర్షాలు పడి ఆశాజనకంగా పంటలు పండి రైతు కుటుంబాలు ఆనందంగా సంక్రాంతి పండుగను జరుపుకుంటుంటే, టీడీపీ నాయకుడు చంద్రబాబు ఆయన భజన పరులైన జనసేన, వామపక్షాలు మాత్రం రాష్ట్రానికి ఏదో జరిగినట్లుగా జీఓ నంబర్ ఒకటిని ఎత్తివేయాలని ఉన్నది లేనట్టుగా చూపుతూ ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ప్రాణాలను కాపాడేందుకు జీఓ నంబర్ 1ను జారీ చేస్తే ప్రతిపక్షాలు మాత్రం ప్రజల ప్రాణాలకంటే వారి రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మోపిదేవి మండి పడ్డారు. తెలుగుదేశం పార్టీ సభలు ఇరుకు సందుల్లో పెట్టి మూడు రోజులు వ్యవధిలోనే రెండు ప్రాంతాల్లో అమాయక ప్రజలు అన్యాయంగా ప్రాణాలు కోల్పోతే కనీసం నోరుమెదపని జనసేన, వామపక్షాలు, ప్రజల ప్రాణాలు పోకుండా కాపాడేందుకు ఇచ్చిన జీఓను మాత్రం ఎత్తివేయాలని లేనిపోని అల్లర్లు చేస్తున్నారన్నారు. ఏ రాజకీయ పార్టీని కూడా సభలు సమావేశాలు జరపొద్దు అని జీఓలో లేదని, ప్రజల ప్రాణాలకు హాని కలుగకుండా బహిరంగ ప్రదేశాల్లో పోలీసుల అనుమతితో నిర్వహించుకోవచ్చన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా చంద్రబాబు నాయకత్వాన్ని నమ్మే పరిస్థితి లేదని, ప్రజలంతా పేదలకు సంక్షేమ పథకాలు అందించే జగనన్న వెంటే ఉన్నారని, పది కాలాల పాటు జగనన్న ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు ఎదురు చూస్తున్నట్లు మోపిదేవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, పార్టీ కన్వీనర్ డి.వెంటేశ్వరరెడ్డి, నాయకులు అబ్దుల్ సమద్, పైనం ఏడుకొండల రెడ్డి, కామినేని కోటేశ్వరరావు, చీరాల ప్రసాద్ రెడ్డి, చెన్ను కోటేశ్వరరావు, చీరాల వెంకటేశ్వరరెడ్డి, తూము కోటేశ్వరరావు, కూరేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మిస్టర్ ఆచార్య నాగార్జున'గా గోపీకృష్ణ


విజేతలతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టీం చాంపియన్‌షిప్ సాధించిన స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ, శరీర సౌష్టవ పోటీల్లోనూ జయకేతనం ఎగురవేసింది. డాక్టర్ వైఎస్సార్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 12న రాత్రి జరిగిన అంతర్ కళాశాలల శరీర సౌష్టవ పోటీల్లో ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ విద్యార్థులు రాతంశెట్టి గోపీకృష్ణ(70కిలోలు), కోట శంకర్(75 కిలోలు), గండికోట సందీప్‌కుమార్(85 కిలోలు) బంగారు పతకాలు సాధించారు. ఆకేటి రాజా(60 కిలోలు), షేక్ రషీద్(75 కిలోలు) షేక్ ఆసిఫ్(80 కిలోలు) రజత పతకాలు సాధించారు. ఏఎస్ఎన్ కాలేజీకి చెందిన బాడీ బిల్డర్ రాతంశెట్టి గోపీకృష్ణ 2022-23 సంవత్సరానికి ' మిస్టర్ ఆచార్యా నాగార్జున' టైటిల్‌ను సాధించినట్టు కాలేజీ వ్యాయామ అధ్యాపకుడు నల్లక శేషగిరిరావు సోమవారం తెలియజేశారు. ఉత్తమ ఫలితాలను సాధించిన కాలేజీ బాడీ బిల్డర్లను ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రాంచంద్ అభినందించారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి


సంఘటన ప్రదేశంలో కోటేశ్వరరావు మృతదేహం

ఫిరంగిపురం: రెండు ద్విచక్ర హనాలు ఢీకొని ప్రమాద స్థలంలో ఒకరు మృతి చెందగా దారిలో మరొకరు మృతి చెందిన సంఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామశివారులో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన గ్రంధి సుబ్రహ్మణ్యం(38)సంక్రాంతి పండుగ సందర్భంగా గుంటూరులోని అత్తగారింటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. ఈ సమయంలో రొంపిచర్ల మండలం కొనకంచిపాలేనికి చెందిన మాచర్ల కోటేశ్వరరావు గుంటూరు నుంచి ద్విచక్ర వాహనం పై నరసరావుపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో వేములూరిపాడు శివారు ఎన్ఎస్పీ కాలువ వద్ద ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎం.కోటేశ్వరరావు(27)అక్కడికక్కడే మృతి చెందగా గ్రంధి సుబ్రహ్మణ్యానికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడ్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

అభయాంజనేయ స్వామి ఆలయంలో దర్శకుడు బాబీ పూజలు

నకరికల్లు: ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేర్ వీరయ్య చిత్రం దర్శకుడు బాబీ నకరికల్లు మండలంలోని చల్లగుండ్ల అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో విశేష పూజలు చేశారు. చిత్రం విడుదలైన సందర్భంగా మండలంలోని కుంకలగుంట గ్రామానికి చెందిన డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం అడ్డరోడ్డుకు చేరుకున్నారు. ఆలయంలో వేదపండితులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. దర్శకుడు బాబీ అభిమానులకు అభివాదం చేశారు.

గుండె పోటుతో డ్రైవర్ మృతి


మృతిచెందిన డ్రైవర్ హరినాథ్

మోపిదేవి (అవనిగడ్డ): గుంటూరు జిల్లా మంగళగిరి యర్రబాలేనికి చెందిన మినీ వ్యాన్ డ్రైవర్ విస్సంశెట్టి హరినాథ్(53) గుండెపోటుతో మృతి చెందిన ఘటన మోపిదేవిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ పద్మ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మంగళగిరికి చెందిన వాహన డ్రైవర్ హరినాథ్ కొంత మంది ప్రయాణికుల్ని మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానానికి తీసుకువచ్చారన్నారు. పూజా కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణంలో వాహనం స్టార్ట్ చేస్తుండగా గుండెపోటు రావడంతో ఆ సీటులోనే మృతి చెందారని చెప్పారు. ప్రయాణికులు వెంటనే 108కు ఫోన్ చేయగా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న చేరుకున్న సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారని ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని వారి కుమారుడు దుర్గాప్రసాద్‌కు అప్పగించినట్లు చెప్పారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు


అదుపులోకి తీసుకున్న నిందితుడితో ఫారెస్టు అధికారులు

బొల్లాపల్లి: వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు సహకరించాలని మాచర్ల సబ్ డివిజన్ ఫారెస్టు అధికారి బెర్నార్డ్ రాజు కోరారు. మండలంలోని నాయుడుపాలెం సెక్షన్‌లో కనుమలచెరువు బీట్‌లో అటవీ జంతువులను వేటాడుతున్న ఒకరిని అదుపులోకి తీసుకుని వన్యప్రాణులను స్వాధీనపరచుకున్నారు. సబ్ డివిజన్ డీఎఫ్ఓ మాట్లాడుతూ బీట్ పరిధిలో రాత్రివేళ గస్తీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బంది వేటగాడిని అదుపులోకి తీసుకుని, ఐదు కుందేళ్లు, ఒక పునుగుపిల్లిని స్వాధీనపరచుకున్నట్లు చెప్పారు. పునుగుపిల్లి, ఒక కుందేలు మృతి చెందినట్లు చెప్పారు. నాలుగు కుందేళ్లను అటవీ ప్రాంతంలో వదలివేయనున్నట్లు తెలిపారు. వేటగాడు ఉమ్మడి ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ముటుకుల గ్రామానికి చెందిన పడిగె శ్రీనివాసరావుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వినుకొండ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, డీఆర్వో ఎం.సురేంద్ర పాల్గొన్నారు.

నాగార్జునకొండపై పర్యాటకుల సందడి



విజయపురిసౌత్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునకొండను సోమవారం భారీగా పర్యాటకులు సందర్శించారు. స్థానిక లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు నాగసిరి లాంచీ, శాంతిసిరి లాంచీలలో కొండకు వెళ్లిన పర్యాటకులు అక్కడ మ్యూజియంలో బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, తొమ్మిది అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, బోధివృక్షం, అశ్వమేధ యాగశాల, స్నాన ఘట్టాలను తిలకించారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపులోని పునర్నిర్మిత కట్టడాలైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, యాంపీ స్టేడియం, శ్రీ రంగనాథస్వామి దేవాలయాలను సందర్శించారు. అనంతరం 60 అడుగుల ఎత్తు నుంచి జాలు వారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. పర్యాటకులు శని, ఆది, సోమవారాల్లో నాగార్జునకొండను సందర్శించడంతో లాంచీస్టేషన్‌కు 2లక్షల రూపాయల ఆదాయం చేకూరినట్లు అధికారులు పేర్కొన్నారు.

''నా జీవితంలో ఉన్న మహిళలందరికీ ధన్యవాదాలు. స్కూల్ ఎడ్యుకేషన్ కంటే కూడా కామిక్ బుక్స్, కథల పుస్తకాలను చదివించి నా క్రియేటివిటీని పెంచిన మా అమ్మ రాజనందినికి, నన్ను బెస్ట్ వెర్షన్‌గా మార్చుకోవడంలో ప్రోత్సహించిన తల్లి లాంటి మా వదిన శ్రీవల్లికి, నా సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా చేయడంతో పాటు నా లైఫ్‌ని డిజైన్ చేసిన నా భార్య రమకు (తను లేకపోతే నేనిక్కడ లేను), చిరునవ్వుతో నా జీవితం ముందుకెళ్లేలా తోడ్పడే నా కూతుళ్లకు ధన్యవాదాలు. ఫైనల్‌గా నా దేశం ఇండియా.. మేరా భారత్ మహాన్.,, జైహింద్' అంటూ సలాం చేశారు దర్శకుడు రాజమౌళి.

నమ్మలేకపోతున్నాను

- రాజమౌళి



● జేమ్స్ కామెరూన్, రాజమౌళి



● రాజమౌళి

అవార్డు వేడుకలో ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ పాల్గొన్నారు. ఈ వేడుక ప్రాంగణంలో కామెరూన్‌ని కలిశారు రాజమౌళి. ''గొప్ప దర్శకులు జేమ్స్ కామెరూన్ 'ఆర్ఆర్ఆర్' సినిమాను చూశారు. ఆయనకు ఈ సినిమా ఎంతో నచ్చడంతో, తన భార్య సుజీని చూడమని సిఫార్సు చేసి, ఆమెతో కలిసి రెండోసారి 'ఆర్ఆర్ఆర్' సినిమాను చూశారు. మా సినిమా (ఆర్ఆర్ఆర్)ను విశ్లేషిస్తూ మీరు (జేమ్స్ కామెరూన్) మాతో పది నిమిషాలు మాట్లాడదాన్ని నేను నమ్మలేకపోతున్నాను. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి దర్శకుల్లో నేనూ ఉన్నానన్నట్లుగా మీరు (కామెరూన్) చెప్పారు. మాతో పది నిమిషాల సమయాన్ని గడిపినందుకు, నన్ను ప్రశంసించినందుకు ధన్యవాదాలు'' అని సోమవారం ట్వీట్ చేశారు రాజమౌళి. ఇక ఈ సంగతి ఇలా ఉంచితే... లాస్ ఏంజిల్స్ వేదికగా ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో హాలీవుడ్‌కు చెందిన మరో ప్రముఖ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్‌ను రాజమౌళి, కీరవాణి కలిసి కాసేపు ముచ్చటించిన సంగతి తెలిసిందే.

పాఠం నేర్చుకున్నాను

- క్రిటిక్స్ అవార్డ్స్‌లో కీరవాణి



అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జరిగిన 'ఫిలిం క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్'లో 'ఆర్ఆర్ఆర్' చిత్రం రెండు (బెస్ట్ ఫారిన్ ఫిల్మ్, బెస్ట్ సాంగ్) విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఈ అవార్డు అందుకున్న అనంతరం రాజమౌళి పై విధంగా ప్రసంగించారు. ఇక ఇటీవల గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్‌లోని 'నాటు నాటు' పాటకు అవార్డు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు 'ఫిలిం క్రిటిక్స్ చాయిస్ అవార్డ్స్'లోనూ ఈ పాటకు అవార్డు సొంతం చేసుకున్నారు చిత్ర సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి. ఈ సందర్భంగా మాట్లాడుతూ– ''జాస్' సినిమా చూసినప్పుడు నేనో పాఠం నేర్చుకున్నాను. షార్క్ దగ్గరికి వచ్చినప్పుడల్లా ప్రమాదం సూచించే విధంగా ఓ సంకేతం ఉంటుంది. అక్కడ రిచ్ ఆర్కెస్ట్రైషన్‌తో మెలోడీ మ్యూజిక్‌ని ఆశించాను, కానీ నిరాడంబరంగా, స్మూత్ మ్యూజిక్‌ని ఇచ్చారు జాన్ విలియమ్స్. నాకు నిరాడంబరత, వినయంతాలూకు పాఠం నేర్పి, ఇన్నేళ్లుగా నాకు స్ఫూర్తిగా నిలిచినందుకు థ్యాంక్స్ జాన్ విలియమ్స్ సార్'' అన్నారు కీరవాణి. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య 'ఆర్ఆర్ఆర్'ని నిర్మించిన విషయం తెలిసిందే.

షూటింగ్‌లో ప్రమాదం

సోమవారం రెండు షూటింగ్ లొకేషన్స్‌లో రెండు ప్రమాదాలు జరిగాయి. ఒకటి హైదరాబాద్‌లో జరుగుతున్న 'ది వాక్సిన్ వార్' షూటింగ్ సెట్. ఈ షూటింగ్‌లో నటి, నిర్మాతల్లో ఒకరైన పల్లవీ జోషి గాయపడ్డారు. రెండోది మలేసియా. ఈ షూటింగ్‌లో హీరో విజయ్ ఆంటోని గాయపడ్డారు. ఆ వివరాల్లోకి వెళితే...





● పల్లవీ జోషి, విజయ్ ఆంటోని

కారు ఢీకొట్టడంతో పల్లవీకి గాయాలు

దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ది వాక్సిన్ వార్'. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్‌లో జరుగుతోంది. ఓ సన్నివేశం చిత్రీకరిస్తుండగా కారు అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో పల్లవీ జోషికి గాయాలు కావడంతో సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స అందించారు. అయితే చేస్తున్న సన్నివేశం పూర్తి చేశాకే పల్లవి ఆస్పత్రికి వెళ్లారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగుందని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చిత్రబృందం తెలిపింది. ఐ యామ్ బుద్ధ ప్రొడక్షన్ పతాకం పై పల్లవీ జోషి 'ది వాక్సిన్ వార్' చిత్రాన్ని నిర్మించడంతో పాటు ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ది కాశ్మీరీ' ఫైల్స్ కోసం వివేక్ అగ్నిహోత్రితో కలిసి పని చేసిన అభిషేక్ అగర్వాల్ తన అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లో ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేయనున్నారు.

బోట్ ప్రమాదంలో గాయపడిన విజయ్ ఆంటోని:

'బిచ్చగాడు' సినిమాతో పాపులర్ అయిన హీరో విజయ్ ఆంటోని తీవ్రంగా గాయపడ్డారు. 'బిచ్చగాడు'కి సీక్వెల్‌గా ఆయన హీరోగా నటిస్తున్న 'బిచ్చగాడు 2' షూటింగ్ మలేసియాలో జరుగుతోంది. ఈ చిత్రానికి విజయ్ ఆంటోనియే దర్శకుడు. ఈ చిత్రం షూటింగ్‌లో భాగంగా వాటర్ బోట్‌లో ప్రయాణిస్తుండగా ఆ బోట్ హఠాత్తుగా కెమెరా ఉన్న మరో పడవలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విజయ్ ఆంటోనీని వెంటనే అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందిస్తున్నారు.

ప్రముఖ రచయిత బాలమురుగన్ కన్నుమూత



సీనియర్ కథా రచయిత బాలమురుగన్ (86) ఆదివారం ఉదయం చెన్నైలో కన్నుమూశారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ తదితర భాషా చిత్రాలకు కథ, మాటలను అందించారాయన. తమిళనాడులోని ఆండిపట్టికి చెందిన బాలమురుగన్ అసలు పేరు సుందర పాండియన్. నటనపై ఆసక్తితో చిన్న వయసులోనే శక్తి నాటక సభ బృందంలో చేరి నాటకాల్లో నటించడం ప్రారంభించారు. 'కుమర గురు' అనే నాటకంలో బాల మురుగన్‌గా నటించి ప్రశంసలు అందుకున్నారు. అప్పటి నుంచి ఆయన పేరు బాలమురుగన్‌గా స్థిరపడిపోయింది. 13 ఏళ్ల వయసులోనే 'కల్ శిలై' అనే నాటకాన్ని రాసి. తానే నటుడుగా రంగ ప్రవేశం చేశారు. ఆయన నటించిన టిప్పు సుల్తాన్, మరుదు పాండియర్ నాటకాలు బాగా ప్రాచుర్యం పొందాయి. 'టిప్పు సుల్తాన్' నాటకాన్ని తిలకించి, బాలమురుగన్ నటనను అప్పటి ప్రముఖ నటుడు ఎంజీఆర్ ఎంతగానో కొనియాడారు. శివాజీ గణేషన్ చిత్రాలకు బాలమురుగన్ ఎక్కువగా కథ, మాటలు అందించారు. అదే విధంగా తెలుగులో ఎన్.టి. రామారావు, కృష్ణ, శోభన్‌బాబు వంటి ప్రముఖ కథానాయకులకు, హిందీలో రాజేష్ ఖన్నా, ధర్మేంద్ర వంటి స్టార్స్ చిత్రాలకు కథలు అందించారు. బాలమురుగన్ కథ అందించిన తెలుగు చిత్రాల్లో 'ధర్మ దాత, అదృష్ట జాతకుడు, కోడలు పిల్ల, బంట్రోతు భార్య, సోగ్గాడు, ఆలుమగలు, జీవన తీరాలు, పుణ్యం కొద్దీ పురుషుడు, భార్యాభర్తలు వంటివి ఉన్నాయి. 1969లో ఆయన మాటలు అందించిన 'దేవరిన్ తునైవన్' చిత్రానికిగానూ తమిళ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ మాటల రచయిత అవార్డుతో సత్కరించింది. తమిళంలో 'రామన్ ఎత్తనై రామనడి', 'పట్టికాడా పట్టణమా' చిత్రాలకుగాను జాతీయ అవార్డును అందుకున్నారు. బాలమురుగన్ భార్య పదేళ్ల క్రితం కన్నుమూశారు. ఈ దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కుమారుడు భూపతి రాజా సినిమా పరిశ్రమలో రచయితగా కొనసాగుతున్నారు. బాలమురుగన్ మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

సస్పెన్స్ లవ్‌స్టోరీ



● తలసాని, ఆకుల అఖిల్

ఆకుల అఖిల్, దర్శక మీనన్, 'చిత్రం' శ్రీను, 'జబర్దస్త్' గడ్డం నవీన్, 'జబర్దస్త్' చిట్టిబాబు, రేవతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బాలుగాడి లవ్ స్టోరీ'. యల్. శ్రీనివాస్ తేజ్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ ఆకుల మంజుల నిర్మిస్తున్న చిత్రం ఇది. ఒక పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రం టీజర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ రిలీజ్ చేసి, చిత్రం యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. అనంతరం ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేసిన దర్శకుడు సముద్ర మాట్లాడుతూ– ''టీజర్ బాగుంది. మంచి కాన్సెప్ట్, కథ ఉన్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ''మంచి కథతో వస్తున్నాం. ఈ సినిమా హిట్‌ని మా తల్లిదండ్రులకు గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్నాను'' అన్నారు ఆకుల అఖిల్. ''లవ్, సస్పెన్స్ అంశాలతో కూడిన చిత్రం ఇది. బ్యాలెన్స్ ఉన్న స్పెషల్ సాంగ్‌ను త్వరలోనే పూర్తి చేసి, మార్చిలో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు దర్శక–నిర్మాతలు.

థ్రిల్లింగ్ అథర్వ



● కార్తీక్ రాజు

కార్తీక్ రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మిస్తున్నారు. నేడు కార్తీక్ రాజు బర్త్ డే. ఈ సందర్భంగా ఈ సినిమా అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ''క్రైమ్, థ్రిల్లింగ్, ఎమోషన్స్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసేలా ఈ సినిమా ఉంటుంది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ చివరి దశలో ఉన్నాయి. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సాగుబడి
ఉత్తరాషాఢ కార్తె : జనవరి 23 వరకు
శ్రావణ కార్తె : 24 నుంచి

మేకల క్షేత్రమే శిక్షణా కేంద్రం

- మేకల పెంపకంలో మార్గదర్శకుడు మూల మహేందర్‌రెడ్డి
- మేకలు, నాటు కోళ్ల పెంపకంలో ఏడాదికి రూ. 8-9 లక్షల నికరాదాయం
- ప్రతి శనివారం ఫామ్ దగ్గరే రైతులకు ఉచిత శిక్షణ
- రైతులు, అధికారుల క్షేత్ర పర్యటనలకు వేదికగా మారిన మహేందర్‌రెడ్డి ఫామ్



● మహేందర్ రెడ్డి

మేకల పెంపకంలో పదేళ్ల అనుభవంతో స్థిరమైన నికరాదాయం పొందుతూ.. జీవాల పెంపకంపై ఆసక్తి చూపే రైతులకు మార్గదర్శిగా నిలిచారు మూల మహేందర్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం సింగప్పగూడ గ్రామంలో పాక్షిక సాంద్ర పద్ధతిలో ఆయన మేకలతో పాటు నాటు కోళ్లను పెంచుతూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. అంతేకాదు ఉచితంగా శిక్షణ ఇస్తూ వందలాది మంది రైతులకు తోడ్పాటునందిస్తున్నారు. జీవాల పెంపకంపై పూర్తి అవగాహన కలిగించుకొని, మక్కువతో పెంపకం చేపడితే వంద శాతం లాభాలు పొందుతారని నిక్కచ్చిగా చెబుతున్నారాయన.

రైతు కుటుంబంలో పుట్టిన మహేందర్‌రెడ్డి బీఎస్సీ చదివి, కొంతకాలం బోర్‌వెల్ రంగంలో పనిచేశారు. 2005లో 14 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం ప్రారంభించారు. తదనంతర కాలంలో వ్యవసాయంతోపాటు జీవాల పెంపకం కూడా తోడైతేనే నిరంతరం రైతుకు ఆదాయం వస్తుందని గ్రహించిన ఆయన మేకల పెంపకం వైపు దృష్టి సారించారు. ప్రభుత్వ పరంగా ఎలాంటి శిక్షణ, ప్రోత్సాహకాలు లేకపోవటంతో సొంతంగానే అనేక రాష్ట్రాల్లో తిరిగి పరిశోధన చేశారు.

గోట్ ఫార్మింగ్ పరిజ్ఞానం కోసం ఆయన పడిన కష్టం అంతా ఇంతా కాదు. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సొంత ఖర్చులతో పర్యటించారు. స్థానిక రైతులను కలిసి వారి అనుభవాలను తెలుసుకున్నారు. పూర్తిస్థాయిలో సక్సెస్ సాధిస్తామనే ధీమా ఎవరూ కల్పించలేకపోయారు. అయినా వెనకడుగు వేయకుండా పట్టుదలతో మేకల పెంపకం చేపట్టారు.

మేకల రైతుల సేవలో..

నా ఫామ్‌లో 250 మేకలున్నాయి. వీటి పెంపకానికి మొత్తం 4 ఎకరాల భూమిని ఉపయోగిస్తున్నా. ముగ్గురికి ఉపాధి కల్పిస్తూ 250 మేకలను పెంచుతున్నా. మేకల పెంపకంతోపాటు నాటు కోళ్ల పెంపకం చేపట్టా. 20 కోళ్లతో ప్రారంభించా. ఇప్పుడు 100కు చేరాయి. వీటిని 500లకు పెంచేందుకు కృషి చేస్తున్నా. మేకలు, కోళ్ల పెంపకానికి మొత్తంగా ఏడాదికి ఈ సుమారు రూ. 6 లక్షల ఖర్చు అవుతుంటే దాదాపు రూ. 14–15 లక్షల ఆదాయం వస్తున్నది. ఖర్చులు పోను ఏడాదికి సుమారు రూ. 8–9 లక్షల నికరాదాయం సంపాదిస్తున్నా. నా అనుభవాలను అందరికీ అందించి సహాయ పడాలనే ఆలోచనతో ఏడేళ్లుగా ప్రతి శనివారం ఉచితంగా ఫామ్ దగ్గరే రైతులకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నా. వారికి ఎప్పుడు ఏ సమాచారం కావాల్సినా ఫోన్‌లో అందిస్తూ వస్తున్నా. నాకు అవకాశం ఉన్నంత వరకు ఈ సేవ కొనసాగిస్తునే ఉంటాను. రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తా. ఏడాదిలో 365 రోజులూ మేక మాంసానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజల అవసరాలకు ప్రతి రోజు సగటున 7–8 వేల మేకల అవసరం ఉంటుందని అంచనా. ప్రభుత్వపరంగా కూడా జీవాల పెంపకంలో శిక్షణ ఇచ్చే ఏర్పాటు చేయాలి. మేకల పెంపకంపై అవగాహన, ఇష్టమే విజయ సోపానమవుతుంది.

- మూల మహేందర్‌రెడ్డి (8008639618),
ఆదర్శ మేకల పెంపకందారుడు,
సింగప్పగూడ, చేవెళ్ల మం., రంగారెడ్డి జిల్లా

ఎకరంలో షెడ్లు, మూడెకరాల్లో మేత...

ప్రభుత్వ సబ్సిడీ పథకాలు సైతం లేక సొంతం గానే 2013లో 65 మేకలతో పాక్షిక సాంద్ర పద్ధతిలో మహేందర్‌రెడ్డి మేకల పెంపకం ప్రారంభించారు. రూ. 13 లక్షలు ఖర్చు చేసి ఎకరం విస్తీర్ణంలో షెడ్లు నిర్మించారు. మహేందర్‌రెడ్డి మూడేళ్లు కష్టపడి మేకల సంఖ్యను 250కు పెంచారు. 1 ఎకరంలో షెడ్లు, నివాస భవనం నిర్మించారు. షెడ్డులో మేకలను నేలపైన కాకుండా.. మీటరు ఎత్తున చెక్కలతో ప్లాట్‌ఫామ్‌ను నిర్మించి, దానిపై మేకలు విశ్రమించేలా ఏర్పాటు చేశారు. పెంటికలు చెక్కల సందుల్లో నుంచి నేల మీద పడిపోతాయి. మేకలకు గాలి, వెలుతురు చక్కగా తగులుతుంది. షెడ్‌కు పక్కనే చుట్టూ ఇనుప కంచెతో దొడ్డిని ఏర్పాటు చేశారు. మేకలు అక్కడ ఆరుబయట ఎండలో తిరుగుతూ మేత మేస్తాయి. మరో మూడు ఎకరాలు మేకలకు కావాల్సిన పచ్చిగడ్డి సాగుకు ఉపయోగిస్తున్నారు. ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్నారు. ఖర్చులు పోను నెలకు రూ. 65–75 వేల నికరాదాయం, ఏడాదికి రూ. 8–9 లక్షల నికరాదాయం పొందుతూ మేకల పెంపకంలో పదేళ్లుగా ఆదర్శంగా నిలుస్తున్నారు.



● ఎలివేటెడ్ షెడ్‌లో విశ్రమిస్తున్న మేకలు



● ఫామ్ వద్ద ఉచితం శిక్షణ తరగతులు

ప్రతి శనివారం ఉచిత శిక్షణ

మేకల పెంపకానికి ముందుకొచ్చే వారికి ఇప్పటికీ ప్రభుత్వపరంగా శిక్షణా కేంద్రాలు అందుబాటులో లేవు. ఈ లోటు భర్తీ చేయడానికి మహేందర్‌రెడ్డి సేవా భావంతో ముందుకొచ్చారు. సీనియర్ రైతుగా తన అనుభవాలను పంచాలనే ఆలోచనతో ప్రతి శనివారం తన ఫామ్ దగ్గరే ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన పద్ధతులను 3 గంటల పాటు సవివరంగా బోధిస్తున్నారు. ఆయన పట్టుదల, నైపుణ్యం గుర్తించిన వెటర్నరీ శాఖ ఔత్సాహిక రైతులను ఆయన ఫామ్‌కు క్షేత్రపర్యటనకు తీసుకురావటం ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి రైతులు, అగ్రి, ఫుడ్ బిజినెస్ విద్యార్థులు ఆయన వద్ద అనుభవపాఠాలు నేర్చుకుంటున్నారు. వెటర్నరీ ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు కోకొల్లలు. వ్యవసాయ కళాశాలలో అనేక సదస్సుల్లో ఆయన సుసంపన్నమైన తన అనుభవాలను పంచుతూ ఉంటారు. 2015లో రైతునేస్తం, 2016లో సీఆర్ఐడీఏ, 2018లో ఐసీఏఆర్ ఉత్తమ ఇన్నోవేటివ్ ఫార్మర్ పురస్కారాలు లభించాయి.

– ఎస్.రాకేశ్, సాక్షి, చేవెళ్ల, రంగారెడ్డి జిల్లా

మేకల పెంపకంలో మెలకువలు

కొత్తగా గోట్ ఫార్మింగ్ చేపట్టే రైతులకు మహేందర్‌రెడ్డి చెబుతున్న సూచనలు:

- ఒక మేక సగటున రెండేళ్లలో మూడు ఈతల్లో ఈతకు రెండు పిల్లల చొప్పున ఇస్తుంది. ఒక మేక పిల్ల అమ్మకానికి రావడానికి 6 నుంచి 8 నెలల సమయం పడుతుంది. చిన్న పిల్లల పోషణను అశ్రద్ధ చేయకుండా మరణాల రేటు తగ్గించాలి.
- కనీసం 25 కేజీల బరువు ఉన్న మేకలనే అమ్ముకోవాలి. మార్కెటింగ్‌లో జీవాలను ఫారంలోనే అమ్ముకోవటం లాభాదాయకంగా ఉంటుంది. నాణ్యమైన మేకల పెంపకమే నోటి ప్రచారంగా పని చేస్తుంది.
- మేకల పెంపకాన్ని యాంత్రికంగా కాకుండా మనసుపెట్టి ఇష్టంగా చేస్తేనే వంద శాతం సక్సెస్ చేకూరుతుంది.
- ముందు జాగ్రత్త చర్యలను, యాజమాన్య మెలకువలు మక్కువతో పాటిస్తే.. 90 శాతం మందులు లేకుండానే మేకల సంతతిని పెంచుకుంటూ పోవచ్చు.
- మేలు రకం మేకల ఉత్పత్తితోనే లాభాలు వస్తాయి. మేకల ఉత్పత్తిలో తల్లి, తండ్రి మేకల నాణ్యత ముఖ్యం.
- పోషక విలువలు ఉండే నాణ్యమైన మేతలను మేకలకు కడుపు నిండా అందించటంతో నాణ్యమైన మేకల ఉత్పత్తి ద్వారా అధిక లాభాలు సాధ్యం.
- సాంద్ర పద్ధతిలో మేకల పెంపకం ఎంతో మేలు. సగం ఎండు మేత, సగం పచ్చి మేతలను అందించాలి.
- ఇరుకుగా కాకుండా అవసరమైన విస్తీర్ణం మేరకు షెడ్ల నిర్మాణం, పరిశుభ్రత, చూడి మేకల, పిల్లల పోషణలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎలివేటెడ్ షెడ్లు నిర్మించాలి. సీజన్‌కు తగిన రీతిలో షెడ్ల నిర్వహణ ఉండాలి.
- మేకల పెంపకంలో రైతు సక్సెస్ కావాలంటే ఎట్టి పరిస్థితుల్లో యాజమాన్య లోపం రానివ్వకూడదు. జీవాలకు పోషక విలువలతో కూడిన మేతను కమం తప్పకుండా అందించాలి.

రోగాలకు రెడ్ సిగ్నల్!



● 'జీపీటీ 2858' పేరిట నన్నని ఎరుపు వరి వంగడానికి రూపుకల్పన

● ఐరన్, జింకు, మాంసకృత్తులు అధికం

అధిక పోషక విలువలతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందించే సేంద్రియ/ప్రకృతి వ్యవసాయంలో పండించిన దేశవాళీ వరి రకాల బియ్యానికి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది. సంప్రదాయ బ్రీడింగ్ పద్ధతుల్లోనే దేశవాళీ వంగడాల్లో పౌష్టికాంశాలతో కూడిన బీపీటీ సన్న వరి రకాల రూపకల్పనపై బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు 2012 నుంచే దృష్టి కేంద్రీకరించారు. 'బీపీటీ బ్లాక్ రైస్' వంగడాలను గత ఏడాదే అధికారికంగా విడుదల చేసి, రైతులకు విత్తనాలను విస్తారంగా అందిస్తున్నారు.

ఈ నేపథ్యంలో 'బీపీటీ రెడ్ రైస్ 2858' వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. దీని పంటకాలం 135 రోజులు. తుపాన్లకు పడి పోదు. దోమ, అగ్గితెగులు, ఆకు ముడత, ఆకు ఎండు తెగుళ్లను తట్టుకుంటుంది. కంకి ముద్దగా వస్తుంది. ఒక కంకిలో 500 నుంచి 600 వరకు గింజలు ఉంటాయి. బీపీటీ 5204 కన్నా సన్న రకం. బీపీటీ 2858 రెడ్ రకం వెయ్యి గింజల బరువు 12 గ్రాములు. నాణ్యతా ఎక్కువే. దేశవాళీ రెడ్ రైస్ దిగుబడి 10 బస్తాలకు మించదు. బీపీటీ రెడ్ రైస్ ఎకరాకు 30 బస్తాలకు తగ్గదని శాస్త్రవేత్తలు చెపుతున్నారు. ఈ రకం రెడ్ రైస్ ధాన్యం పై పొట్టు మామూలుగానే ఉంటుంది. కానీ, బియ్యం నల్లగా ఉంటాయి. బియ్యం పై పొరలో 'ప్రొయాంతో సైనిడిన్' అనే పదార్థం ఉండడం వల్ల వాటికి ఎర్ర రంగు వచ్చింది. అందుకని, ముడి బియ్యాన్నే తినాలి. ఇందులో ఐరన్, జింకు, ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. సాధారణ బియ్యంతో పోలిస్తే రెండు రెట్లు అధికం. యాంటీ ఆక్సిడెంట్లు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. అధికంగా 10.5 శాతం మాంసకృత్తులు ఉన్నాయి. టోటల్ ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్స్ సాధారణ రకాలతో పోలిస్తే రెండు రెట్లు అధికం. శరీరంలో ఉత్పత్తయ్యే ఫ్రీరాడికల్స్‌ను ఇవి సమతుల్యం చేసి రోగనిరోధక శక్తిని ఇనుమడింపజేస్తాయి. రెడ్ రైస్‌లో బీపీటీ 2858తో పాటు బీపీటీ 3143, 3182, 3140, 3111, 3507 రకాలను సైతం రూపొందిస్తుండటం విశేషం.



ఎర్ర బియ్యం ఎంతో ఆరోగ్యం

జీపీటీ 2858 రెడ్‌రైస్ విత్తన మినీకిట్లను ఈ ఏడాది జూన్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లా కేంద్రాల్లోనూ వ్యవసాయశాఖ జేడీఏలు, డాట్ సెంటర్లలో పంపిణీ చేస్తారు. మూడు సంవత్సరాల మినీకిట్ దశను వచ్చే ఏడాది పూర్తిచేసి, ఆ తరువాత అధికారికంగా విడుదల చేస్తాం. జీపీటీ 2858 రెడ్‌రైస్ దీర్ఘకాలిక రోగాలను ఎదుర్కొనే పుష్టిని కలిగిస్తుంది. మనుషుల ఆరోగ్య రక్షణకు అత్యంత అనుకూలమైన రకం.



- బి.కృష్ణవేణి,
సీనియర్ శాస్త్రవేత్త - అధిపతి,
వ్యవసాయ పరిశోధనా కేంద్రం, బాపట్ల

– బిజివేముల రమణారెడ్డి,
సాక్షి ప్రతినిధి, బాపట్ల

నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాగుబడి డెస్క్